క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా 11కేవీ హైకోర్టు కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు.

జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌నకు ముగ్గురు విద్యార్థులు

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ముగ్గురు 8వ తరగతి విద్యార్థులు జాతీయ స్థాయి స్కాలర్‌షిప్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్-2022)కు ఎంపికయ్యారు. గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్ష ఫలితాలను విద్యాశాఖ శుక్రవారం వెల్లడించింది. అందులో ఆ పాఠశాలకు చెందిన వట్నాల మౌనిక, కటికెల నవ్యశ్రీ, కేతావత్ జస్వంత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణమూర్తి శుక్రవారం తెలిపారు. ఆ విద్యార్థులకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. 2017 నుంచి 2022 వరకు మొత్తం 12మంది విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. కాగా స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ మంద జ్యోతిపాండు, సర్పంచ్ గంగాపురం గోపాల్‌రెడ్డి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ చిట్టె ఈశ్వర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

జాతీయ పోటీలకు ఇద్దరు విద్యార్థినులు

బడంగ్‌పేట్: జన జాతీయ ఖేల్ మహోత్సవ్ పేరుతో వచ్చే నెల 9నుంచి 12వరకు ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మరియు ఖేలో ఇండియా సంయుక్తంగా గ్రామీణ మరియు స్వదేశీ జాతీయ గిరిజన క్రీడలు-2023 నిర్వహిస్తున్నారు. ఇందుకు క్రీడాకారులను ఎంపిక చేసేందుకు హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో రాష్ట్ర స్థాయి సెలక్షన్లు చేపట్టారు. శుక్రవారం బడంగ్‌పేట జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎస్.మౌనిక(9వ తరగతి) 100 మీటర్ల పరుగులో, కేతావత్ ధనలక్ష్మి(9వ తరగతి) 400 మీటర్ల పరుగులో రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని ఎచ్‌హెచ్ అర్జున్ చెప్పారు.


యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సందీప్‌రెడ్డి



బడంగ్‌పేట్: యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కార్పొరేషన్ పరిధిలోని కొంతం సందీప్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి శుక్రవారం గాంధీభవన్‌లో ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ యువజన విభాగంలో చురుగ్గా పనిచేస్తున్న తనను గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీకి తన నియామకానికి సహకరించిన శివసేనారెడ్డి, రవికాంత్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి

మున్సిపల్ చైర్మన్ మధుమోహన్



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

తుక్కుగూడ: ప్రతీ ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ కె.మధుమోహన్, కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. శుక్రవారం రావిర్యాల వార్డు కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోడు, మందులను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజీకుమార్, కౌన్సిలర్లు వై.శివకుమార్, బోధ యాదగిరిరెడ్డి, బాకి విలాస్, నాయకులు శివశంకర్, సురేశ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యానికి సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: మున్సిపాలిటీలో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పారిశుద్ధ్య పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అప్పగించలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య జటిలం

ట్రాఫిక్ సమస్యతో ప్రజలు సతమవుతున్నారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. యూటర్న్‌ల వద్ద వాహనాలు నిలిచి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

- మలుపుల వద్ద నిత్యం అంతరాయం
- సమతమవుతున్న వాహనదారులు



బాలాపూర్ చౌరస్తా సమీపంలోని మలుపు వద్ద పరిస్థితి

మీర్‌పేట: ఒక భారీ వాహనం మలుపు తీసుకోవాలంటే రోడ్డుకు ఇరువైపులా ఇతర వాహనాలు నిలిచిపోవాల్సిందే.. బాలాపూర్ చౌరస్తాలోని మలుపుల వద్ద నిత్యం ఇదే తంతు.. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తా అతిపెద్ద కూడలి. ఎయిర్‌పోర్టుకు వెళ్లే మార్గం కూడా. రహదారిపై నిత్యం ఎయిర్‌పోర్టుతో పాటు ఇతర వాహనాలు వందలాదిగా రాకపోకలు సాగిస్తుంటాయి. బావర్చి, సూపర్ థియేటర్‌ల సమీపంలోని యూటర్న్‌ల వద్ద వాహనాలు మలుపు తీసుకునే క్రమంలో రోడ్డు ఇరుకుగా ఉండి రెండు వైపులా దాదాపు అర కిలోమీటరు వరకు వాహనాలు నిలిచిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం ఈ దారిలో ప్రయాణించే వావానదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక లారీ, బస్సు, ఇతర భారీ వాహనాలు మలుపు తీసుకుంటే కొన్ని క్షణాల పాటు ఇతర వాహనాలు నిలిచిపోవాల్సిందే. కొంత కాలంగా ప్రధాన రహదారిపై ఈ సమస్య ఉత్పన్నమవుతున్నప్పటికీ ట్రాఫిక్ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. చౌరస్తాలో జరిమానాలు విధించే పనిలో ఉండే ట్రాఫిక్ సిబ్బంది మలుపుల వద్ద సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాల తిప్పలు

బాలాపూర్ చౌరస్తా ప్రధాన రహదారిపై నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ వేళలతో పాటు వారాంతంలో, చౌరస్తాలోనే ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టడంతో కూడలి దాటేందుకు చాలా సమయం పడుతోందని వాహనదారులు తెలిపారు. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అధికారులు చొరవ తీసుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తా



మెడల్స్ అందజేస్తున్న మలేషియా పార్లమెంటు సభ్యుడు వరదరాజు నాయుడు, శివకుమార్

హుడాకాంప్లెక్స్: ఇటీవల మలేషియాలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో జూనియర్ విభాగంలో నీరవ్‌రెడ్డి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ మేరకు శుక్రవారం విజేతను కొత్తపేటలోని జేఎస్‌పీఎస్‌కే అకాడమీ ఇండియా చీఫ్ శివకుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ ఒకినావా గోజురాయ్ కరాటే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మలేషియాలోని ఇప్లో సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీలలో తెలంగాణ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారన్నారు. 40 కేజీల విభాగంలో నీరవ్‌రెడ్డి గోల్డ్‌మెడల్ సాధించగా, 70 కేజీల విభాగంలో ప్రతిమసాయి బ్రాంజ్ మెడల్ సాధించాన్నారు. ఈ మేరకు వారికి మలేషియా పార్లమెంటు సభ్యుడు వరదరాజు నాయుడు పతకాలు అందజేశారని ఆయన వివరించారు.

క్షతగాత్రుడుకి పరామర్శ



రమేశ్‌నాయక్‌ని పరామర్శిస్తున్న కార్తీక్‌రెడ్డి

మహేశ్వరం: మండల పరిధిలోని నాగుల్‌దోని తండా పంచాయతీకి అనుబంధంగా ఉన్న దయాల్‌గుండు తండాకు చెందిన కొర్ర రమేశ్ నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి బాలాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర యువనాయకుడు పి.కార్తీక్‌రెడ్డి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్, నాయకులు వీరు, రవి, భాస్కర్, సిద్ధార్థ్ తదితరులున్నారు.

ఎనిమిది ఆలయాల అభివృద్ధికి రూ.8 కోట్లు

మంత్రి సబితారెడ్డి



మహేశ్వరం: పురాతన ఆలయాలకు పూర్వవైభవం తీసుకువస్తామని మౌలిక వసతులతో పాటు అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం మాట్లాడారు. నియోజకవర్గంలో అతి పురాతన దేవాలయాలకు మహర్దశ పట్టనుందన్నారు. మండలంలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, జెన్నాయిగూడ లక్ష్మీనృసింహ స్వామి, ఉప్పుగడ్డ తండాలోని శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ మూడు పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.3కోట్ల నిధులు మంజూరు చేసిందని ఆమె తెలిపారు. పక్షం రోజుల క్రితం మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయం, తుక్కుగూడ మున్సిపాలిటీ ఫ్యాబ్‌సిటీ శ్రీ వేంకటేశ్వర, బాలాపూర్ వేణు గోపాలస్వామి, ఆర్‌కేపురం ఖిల్లా మైసమ్మ, జిల్లెలగూడ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.5కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఆ నిధులతో దేవాలయాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె వెల్లడించారు. సీఎం కేసీఆర్ అన్ని మతాలు, వర్గాలు, కులాలను సమానంగా చూస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది దేవాలయాల అభివృద్ధికి కోరిన వెంటనే రూ.8కోట్లు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిలకు మంత్రి సబితారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఫార్మాసిటీ పీఎస్‌ను మీర్‌ఖాన్‌పేటలో ఏర్పాటు చేయండి

జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి



రాచకొండ సీపీకి వినతిపత్రం అందిస్తున్న జంగారెడ్డి తదితరులు

కందుకూరు: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌ను మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట గ్రామంలో ఏర్పాటు చేయాలని.. లేదంటే ఇక్కడి గ్రామాలను కందుకూరు పీఎస్ పరిధిలోనే యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ మేరకు జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నాయకులు శుక్రవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. యాచారం మండలం మేడిపల్లిలో ఫార్మా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తూ కందుకూరు మండలంలోని ఫార్మాసిటీ పరిధిలోకి వచ్చే మీర్‌ఖాన్‌పేట, ఆకులమైలారం, బేగరికంచె, సార్లరావులపల్లి, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ గ్రామాలను అక్కడి పీఎస్‌లో విలీనం చేసేలా అధికారులు ప్రతిపాదించారన్నారు. దీంతో ఆ గ్రామాల ప్రజలకు అక్కడికి వెళ్లాలంటే ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే పీఎస్‌ను మీర్‌ఖాన్‌పేటలో ఏర్పాటు చేస్తే అన్ని గ్రామాలకు సమదూరంగా ఉండటంతో పాటు రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని పరిశీలించాల్సిందిగా సీపీని కోరామన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కాకి రాములు, బీఆర్‌ఎస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఇ.సత్తయ్య, నాయకులు జి.రాజు, పాండు, ప్రవీణ్‌నాయక్, శేఖర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందజేసిన చంద్రయ్య, నర్సింహగౌడ్

బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య

మహేశ్వరం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతోందని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, కోళ్లపడకల్ ఎంపీటీసీ సభ్యుడు హన్మగళ్ల చంద్రయ్య అన్నారు. మండల పరిధిలోని కోళ్లపడకల్‌లో ఐతాబాద్ భారతమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేపీఎల్-7 క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తుందన్నారు. ఈ పోటీల్లో పుల్లమోల్ల ప్రశాంత్ జట్టుపై చేపంగి శ్రీకాంత్ జట్టుపై విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.25వేల నగదు, షీల్డ్ మాజీ సర్పంచ్ ఐతాబాద్ నర్సింహగౌడ్, ద్వితీయ బహుమతి జట్టుకు ఎంపీటీసీ సభ్యుడు హన్మగళ్ల చంద్రయ్య రూ.15వేల నగదు, షీల్డ్ అందదజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు చేపంగి ప్రవీణ్, వార్డు సభ్యులు భిక్షపతి, భాస్కర్ గౌడ్, మహేశ్, రఘుపతి, రాథోడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాలకిషన్



బాలకిషన్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

హుడాకాంప్లెక్స్: వీఎం హోం వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బేర బాలకిషన్, ప్రధాన కార్యదర్శిగా నోముల కబీర్‌దాస్, కోశాధికారిగా జక్కుల శ్రీశైలం, సలహాదారులుగా బబ్బూరి అనిల్ కుమార్, సంజీవరెడ్డి, మక్కపాటి హైమావతి, రామారావు, కార్యవర్గ సభ్యులుగా కొండా గిరి, రమణ, శ్రీనివాస్, కైరంకొండ ధనంజయ, నగేష్‌గుప్తా, ఐలయ్య, చందర్, బద్దుల వెంకటేశ్, దర్పల్లి సుభాశ్, దర్పల్లి రాజు, రమేశ్, జయప్రకాశ్‌గుప్తా ఎన్నికయ్యారు.

ఘనంగా శని జయంతి



ప్రవచనాలు చేస్తున్న గురూజీ

కందుకూరు: పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో శుక్రవారం అమావాస్య హోమంతో పాటు శని జయంతి పూజలను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చండీ హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి చేశారు. గురూజీ భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ఆశీర్వాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'న్యూ మాస్టర్ మైండ్' సత్తా

రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని న్యూమాస్టర్ మైండ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహన్‌రావు, సెక్రెటరీ పాండు రామావత్, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వారం రోజుల్లో పనులు ప్రారంభించాలి

- లేదంటే జలమండలి కార్యాలయం ఎదట ధర్నా
- సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీవాణి



మురుగునీటిని బకెట్‌లో ఎత్తుతూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్

హుడాకాంప్లెక్స్: వారం రోజుల్లో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించకుంటే డ్రైనేజీ నీటితో జలమండలి కార్యాలయం ఎదట ధర్నా చేస్తామని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి హెచ్చరించారు. శుక్రవారం హుడాకాంప్లెక్స్ సౌమ్య అపార్ట్‌మెంటు ఎదుట నిలిచిన మురుగును బకెట్లలో ఎత్తి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అపార్ట్‌మెంటు ఎదుట మురుగు నీరు చెరువును తలపిస్తోందన్నారు. పనులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకుని వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆరు నెలల క్రితం మంత్రి సబితారెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు పర్యటించి వారం రోజుల్లో మురుగు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు అమలు కాలేదన్నారు. నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడం బాధాకరమని, వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు.

అవిశ్రాంత పోరాట యోధుడు.. పుచ్చలపల్లి

సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్



సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు: కుల రహిత, పేదలు లేని సమాజ నిర్మాణం కోసం కలలుగన్న అవిశ్రాంత పోరాటయోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం మండల కార్యదర్శి బుడ్డీరపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో ప్రజాపోరాటాలతో సమస్యలకు పరిష్కారం చూపిన నిస్వార్థ కమ్యూనిస్టు అన్నారు. ప్రతీ ఒక్కరు ఆయన మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రవికుమార్, మండల కమిటీ సభ్యులు కుమార్, బాల్‌రాజు, మహేశ్వరం మండల కమిటీ సభ్యులు శేఖర్, నాయకులు శేఖర్, కుమార్, వీబీకేల సంఘం నాయకులు సరస్వతి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత పంపిణీ త్వరగా పూర్తిచేయండి

ఎమ్మెల్యేను కోరిన గొర్రెల కాపరుల సంఘం నాయకులు



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో శుక్రవారం గొర్రెల కాపర్ల సంఘం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరుల సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండో విడుత గొర్రెల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కోరారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు యాదయ్య, సర్పంచ్ కృష్ణయ్య, ఉప సర్పంచ్ రామకృష్ణ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు వెంకటేశ్, బీరప్ప, చెన్నయ్య, మల్లయ్య, శ్రీను, జంగయ్య, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

మెరుగైన సేవలందించేందుకే వార్డు కార్యాలయాలు



కాలనీలోని పాత భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నగరంలోని అన్ని డివిజన్లలో ప్రత్యేకంగా వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసి ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. హస్తినాపురం డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీ ఫేజ్-2 కాలనీవాసులు శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సమావేశమయ్యారు. కమ్యూనిటీహాల్‌లో వార్డు కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల ఇతర కార్యక్రమాలు చేసుకునేందుకు వీలుండదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ప్రత్యేకంగా వార్డు కార్యాలయం ఏర్పాటు చేస్తానని తెలిపారు. అదే విధంగా డివిజన్ల పరిధిలో ఉపయోగంలో లేని పాత భవనాలను గుర్తిస్తే, అధికారుల సూచనల మేరకు ఇట్టి భవనాలను పరిశీలించి అన్ని అనుకూలంగా ఉంటే కేటాయిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

ఉచిత విద్యను అందించేందుకు 'మదర్సా'



మదర్సాను ప్రారంభిస్తున్న అబ్దుల్ ఖాదర్‌ఖాద్రి

ఆమనగల్లు: పట్టణంలోని మహ్మదీయ మసీదులో మదర్సాను శుక్రవారం మహ్మదీయ మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ఖాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉచితంగా విద్యను అదించేందుకు మదర్సాను ప్రారంభించామన్నారు. విద్యార్థులకు చిన్న నాటి నుంచి సత్ప్రవర్తనతో అల్లా మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం మదర్సా కమిటీ సభ్యులకు కలిసి విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ గౌరవ అధ్యక్షుడు చాంద్‌పాషా, ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, కార్యదర్శి మహబూబ్ అలీ, సంయుక్త కార్యదర్శి రహీం, లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా, షేక్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

'పీఎంఎస్‌బీవై'ను వినియోగించుకోవాలి

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ధ గ్రామంలో శుక్రవారం పీఎం సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) గ్రామస్తులు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట ఎస్‌బీఐకు చెందిన బ్యాంకు అధికారులు రవీందర్, సునీల్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. రూ.2లక్షల ప్రమాద బీమా కవరేజీ రూ.20 వార్షిక ప్రీమియం చెల్లించాలన్నారు. 18-70 ఏళ్ల లోపు మధ్య వయస్సున్న బ్యాంకు ఖాతాదారులు మొత్తం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రమాదం లేదా, శాశ్వత వైకల్యాన్ని ఈ బీమా కవర్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ డెయిరీ ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.